క్లుప్తంగా

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి


మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ లింబాద్రి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ లింబాద్రి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలో శనివారం బీసీ కుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ కుల గణన చేపట్టేందుకు ఈ నెల 9న మెట్‌పల్లిలో సత్యాగ్రహం చేపడుతున్నట్లు బీసీ కులస్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కోరుట్ల నుంచే ఉద్యమం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘనాయకులు గురిజెల రాజరెడ్డి, తొగిటి అంజయ్య, కమటం రమేష్, కొక్కు పురుషోత్తం, సుగుణాకర్‌రావు, నేమూరి సత్యనారాయణ, వెంకటేశ్ యాదవ్, కంతి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోవాలి


ఇన్సూరెన్స్ పత్రాలతో ప్రెస్‌క్లబ్ సభ్యులు

వెల్గటూర్: పోస్టల్ ఇన్సూరెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎండపల్లి సబ్ పోస్ట్‌మాస్టర్ సతీశ్ కుమార్ అన్నారు. శనివారం ఎండపల్లి మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్‌లో మండల ఐజేయూ ప్రెస్‌క్లబ్ సభ్యులు పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించుకుని ఆదర్శంగా నిలిచారని అన్నారు. తపాలా బీమాతో కుటుంబానికి ధీమా ఉంటుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు కుమార్, శ్రీవణ్, శ్రీనివాస్, సతీష్, రమేష్, లక్ష్మీరాజం, రాజేశం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా కేంద్రాలు నిర్వహిస్తే కఠినచర్యలు


నాటుసారా స్వాధీనం చేసుకున్న అధికారులు

మల్లాపూర్: నాటుసారా, గుడుంబా కేంద్రాలను నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్ హెచ్చరించారు. మల్లాపూర్ మండలంలోని వీవీరావుపేటలో శనివారం మెట్‌పల్లి ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడ్ మాట్లాడుతూ అక్రమంగా గుడుంబాను తయారు చేసి అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ చట్టం కింద అరెస్టు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ షాకిర్ వహీద్, కానిస్టేబుల్ రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

దుండగుడిపై చర్యలు తీసుకోవాలి


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు చంద్రశేఖర్ అజాద్ చిత్రంపై మూత్ర విసర్జన చేసి అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని భారత సురక్షణ సమితి నాయకులు శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్ ప్రహరీ మున్సిపల్ ఆధ్వర్యంలో పలువురి దేశ భక్తుల చిత్రపటాలను పెయింటింగ్ వేయించారు. చంద్రశేఖర్ అజాద్ చిత్రపటంపై ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేస్తున్న వ్యక్తి ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీఎస్ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి శుభ్రం చేసి క్షీరాభిషేకం చేసి, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పాలం మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, కాశీనాథం, భూమయ్య, బాలయ్య, పద్మాకర్, అరుస్, పరందాంలు పాల్గొన్నారు.



మహిళలందరినీ ఏకం చేసే పండుగ



ఏ పండుగైనా ఎవరి ఇళ్లలో వారే జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ మాత్రం తొమ్మిది రోజుల పాటు మహిళలందరినీ ఒక్క చోటకు చేర్చుతుంది. అదే బతుకమ్మ పండుగ ప్రత్యేకత. ఊరూ, వాడా చుట్టాలు, బంధువులను ఒక్కచోట కలిపే బతుకమ్మ అంటే మా కుటుంబమంతటికీఇష్టం. చిన్నా, పెద్దా తేడా లేకుండా బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటారు.

– భారతి, జగిత్యాల

సాంప్రదాయం, శాస్త్రీయతల మేళవింపు



ప్రకృతి ఒడిలో లభించే తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను చూడటం, ఆడటం ద్వారా పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మలను పేర్చుతారు. సహజసిద్ధంగా శాస్త్రీయ దృక్పథంతో రూపొందించారు. బతుకమ్మలో సాంప్రదాయ ఆరోగ్య రహస్యం ఇమిడి ఉంది.

– పడాల రిషితాప్రసాద్, వైద్య విద్యార్థిని, జగిత్యాల

వివక్షకు తావు లేనిది బతుకమ్మ



పెగడపల్లి: కుల, మత, ధనిక, పేద బేధం లేని పండుగ ఇది. వివక్షకు తావులేని సమాజం కోరుకునే ఇందులో దాగిన అంతర్యం. తీరొక్క పూలను బతుకమ్మగా పేర్చి పూజలు చేసే సంప్రదాయం తెలంగాణ సొంతం. ప్రకృతిని ఆరాధించే ఈ పూల పండుగ మహిళలకు ఎంతో ఇష్టమైనది.

– గుండి అరుణ ప్రైవేటు టీచర్, పెగడపల్లి


కుమ్మరిపల్లిలో దుర్గామాతకు తెప్పోత్సవం


అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్


కోరుట్లలో కుంకుమ పూజలో మహిళలు


మెతాపూర్‌లో అమ్మవారికి 108 రకాల నైవేద్యాలు


ఇప్పపల్లిలో కుంకుమపూజలో మహిళలు


పెగడపల్లిలో కుంకుమపూజలో మహిళలు

గాయత్రీమాతగా దుర్గాదేవి

జగిత్యాలటౌన్/ జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/రాయికల్/కథలాపూర్/సారంగాపూర్: దేవీశరన్నరాత్రుల్లో భాగంగా శనివారం మూడోరోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జగిత్యాల పట్టణంలోని నవదుర్గా పీఠ క్షేత్రంలో, చంద్రఘంటా రూపంలో, పలు చోట్ల గాయత్రీమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, భవాని దీక్షా పరులుప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.


చంద్రఘటా రూపంలో అమ్మవారి దర్శనం


మోరపల్లిలో గాయత్రీమాత అలంకరణలో దుర్గాదేవి


బీర్‌పూర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు


మెట్‌పల్లి జూనియర్ కళాశాలలో..


రాయికల్ బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు


మల్లాపూర్ జూనియర్ కళాశాలలో..

బతుకమ్మ వేడుకలు

కోరుట్ల/కథలాపూర్/ మెట్‌పల్లి/సారంగాపూర్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినులు రంగు రంగుల పూవులతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ ఆట పాటలతో విద్యార్థినులు సందడి చేశారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ప్రపంచం మెచ్చిన మేధావి అంబేడ్కర్

• ఎమ్మెల్యే సంజయ్ కుమార్


విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే, నాయకులు

సారంగాపూర్: ప్రపంచం మెచ్చిన మేధావి భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగునూర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మండల కేంద్రంలో 14 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, నాయకులు బెక్కం శంకర్, జంగిలి గంగాధర్, పూడూరి శోభన్,విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ప్రసాదాలు అందజేసి, శాలువతో సత్కరించారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాయికల్: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణ,మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి అచ్యుతరావు, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్,అధికారులు పాల్గొన్నారు.

సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుని ఊరేగింపు(శావ) తమ కాలనీకి తీసుకురాకపోవడంపై దళితులు ఆర్డీవో,పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు శనివారం వీడీసీ సభ్యులను,దళితులను,పూజారిని కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు.సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరువురికి సూచించారు.శావను ఎస్సీ కాలనీకి ఎందుకు తీసుకెళ్లదని వీడీసీ సభ్యులను ప్రశ్నించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

రాయికల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాయికల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దాసరి కృష్ణహరిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దొంతి సతీశ్, మండల అధ్యక్షుడు అంతడుపుల గంగారాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, ఉపాధ్యక్షుడు కడకుంట్ల అభయ్‌రాజ్, బాపురావు పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతలకు ఎస్సై సన్మానం

పెగడపల్లి: మండలంలోని ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించిన లింగాపూర్, రాజరాంపల్లి తండాకు చెందిన తడగొండ నరేశ్, నగావత్ స్వప్నను శనివారం ఎస్సై రవికిరణ్ పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన నరేశ్, స్వప్నలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

అంజనేయ వాహనంపై స్వామివారు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా స్వామి వారు అంజనేయ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బూరుగు రామస్వామిగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యేను కలిసిన పట్టణ ఎస్సై



జగిత్యాల రూరల్: జగిత్యాల పట్టణ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిరణ్ శనివారం రాత్రి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎమ్మెల్యేకు పూల మొక్క అందజేశారు.

సిరిపూర్ సొసైటీ పాలకవర్గం నిరసన

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ సొసైటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. గత సీఈవో అవినీతికి సంబంధించి భూములను సంఘానికి అటాచ్ చేసి వేలం వేయగా, ఆ భూములను సొంతం చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్ చేయాలని, మెట్‌పల్లి మండలం వేంపేట శివారులోని గత సీఈవోకి సంబంధించి భూమిని అక్రమంగా బదాలింపుకాబడిన వ్యక్తి నుంచి తిరిగి సంఘానికి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లపై అధికారులు స్పందించే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి, వైస్ చైర్మన్ దూలూరి సుధాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్‌లో ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన గుగ్గిళ్ల నాగరాజు, గణపతి నరేందర్ రాజులతో పాటు, ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన బద్దం రశ్మీతలను శనివారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

కోరుట్ల: దసరా, దీపావళి సందర్భంగా టపాసులు అమ్ముకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నిర్ధారించిన స్థలాల్లోనే అమ్మకాలు సాగించాలని తహశీల్దార్ కిషన్ శనివారం తెలిపారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి సరఫరాపై సహాయకులకు శిక్షణ

పెగడపల్లి: గ్రామాల్లో నీటి సరఫరాలో తరుచుగా ఎదురవుతున్న సమస్యలను గ్రామ పంచాయతీల పంపు ఆపరేటర్లే (సహాయకులు) పరిష్కరించుకునే దిశగా వారికి శిక్షణ ఇస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాల పంపు ఆపరేటర్లు (నీటి సరఫరా సహాయకుల)కు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ట్యాంకుల నుంచి ఇళ్లకు నీటిని సరఫరా చేసే సమయంలో సమస్యలు ఏర్పడితే వారికి మరమ్మతులపై అవగాహన లేక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సమస్యలను సహాయకులే పరిష్కరించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏఈ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కార్యదర్శులకు సన్మానం

ధర్మపురి: ప్రజలకు సేవలందించి బదిలీపై వెళ్లిన, కొత్తగా చేరిన కార్యదర్శులకు మండలంలోని నేరెల్ల గ్రామపంచాయతీలో గత 5 ఏళ్లుగా కార్యదర్శిగా పని చేస్తున్న గుర్రం మల్లారెడ్డి బదిలీ కాగా, మేడిపెల్లి మండలంలోని రావోజీపేటలో కార్యదర్శిగా పనిచేసిన ఫకీరు రాజు నేరెళ్లకు నూతన కార్యదర్శిగా వచ్చారు. శనివారం ఇద్దరు కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాజాల రమేష్, మాజీ సర్పంచ్ పలిగిరి సత్యం, తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ధర్మపురి: ధర్మపురిలోని గాయత్రి బ్యాంకులో శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు బ్యాంకు మేనేజర్ వొజ్జల మోహన్ రూ.లక్ష చెక్కు అందజేశారు. ధర్మపురికి చెందిన గాడిచెర్ల గంగన్న గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా దారులుగా ఉన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా మృతుని భార్య వరలక్ష్మికి రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటస్వామి సేవలు మరువలేం


నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


జగిత్యాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ నివాళి

జగిత్యాలక్రైం/కోరుట్ల/ధర్మపురి/రాయికల్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/వెల్గటూర్: దివంగత కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ధర్మపురి, వెల్గటూర్‌లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోఅడిషనల్ ఎస్పీ భీంరావు నివాళి అర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు,కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో కాకా చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సిబ్బంది కొరత తీరుస్తా


పీహెచ్‌సీ పరిసరాలు పరిశీలిస్తున్న నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరతను తీర్చేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఎంత మంది పెషెంట్స్‌లు వస్తున్నారు, సిబ్బంది కొరతపై వైద్యాధికారి హరీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు కొక్కు పురుషోత్తం,ఆకుల లింగారెడ్డి, నాయకులు నేరేళ్ల దేవేందర్, సుగుణాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతాం

మల్లాపూర్: ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని గుండంపల్లిలో మల్లాపూర్ పర్యటించి లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేసిందన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్ప, మాజీ సర్పంచ్‌లు మామిడి లక్ష్మారెడ్డి, భూపెల్లి దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలి

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపచేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భరతమాత కూడళి వద్ద విపక్షపార్టీలు, రైతులతో కలిసి నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ హామీలతో పాటు అసెంబ్లీ ఎన్నికల వేళా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల్లో రైతులందరికీ ఏకకాలం రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి, అమలులో మాత్రం అర్హులైన రైతులకే అంటూ మెలిక పెట్టడమేంటని ప్రశ్నించారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం, భారతీయ కిసాన్‌సంఘ్ మండల అధ్యక్షుడు కళ్లెం మహిపాల్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఇంటిపెద్దపై దాడి, కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామంలో ఇంటి యజమానిపై భార్య, ఇద్దరు కొడుకులు, కోడలు దాడి చేయడంతో నలుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఒడ్డెరకాలనీకి చెందిన దండుగుల నడిపినర్సయ్య ఇంటిలో కొన్ని రోజులుగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. ఈ కారణంతో నడిపినర్సయ్యను భార్య దండుగుల సుశీల, కొడుకులు దండుగుల లవన్,కిషన్, పెద్ద కోడలు దండుగుల రమ నర్సయ్యను అసభ్యపదజాలంతో దూషించి, దాడి చేయడంతో నర్సయ్యకు గాయాలయ్యాయి. నర్సయ్య ఫిర్యాదు మేరకు దాడిచేసిన భార్య, ఇద్దరు కొడుకులు, కోడలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిధులు మంజూరు

సారంగాపూర్: బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో వర్షాలకు చెడిపోయిన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు.